క్లుప్తంగా

మధ్యాహ్న భోజనం తనిఖీ

కోడుమూరు: మండలంలోని వర్కూర్ హరిజన వాడలో ఉన్న పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులు, మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఈవో అనంతయ్య బుధవారం తనిఖీ చేశారు. నాణ్యమైన మెటీరియల్‌తో పనులు చేపట్టాలని ప్రధానోపాధ్యాయుడు విక్టర్‌ను ఆదేశించారు.మెనూ ప్రకారం మధ్యాహ్నం భోజనం విద్యార్థులకు అందజేయాలని సూచించారు. అలాగే మోడల్ స్కూల్‌ను ఎంఈవో సందర్శించి విద్యార్థులు రాస్తున్న అసైన్‌మెంట్ సంగ్రహణాత్మక మూల్యాంకనను పరిశీలించారు.

క్రీడాకారుడికి కన్నీటి వీడ్కోలు

పాణ్యం: రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన పాణ్యం కబడ్డీ క్రీడాకారుడు పాల సమరకు క్రీడాకారులు, బంధువులు కన్నీటి వీడ్కోలు పలికారు. బుధవారం అంత్యక్రియలను కుటుంబ సభ్యులు నిర్వహించారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందించింది. అలాగే కబడ్డీ ఆర్గనైజేషన్ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల సమర భౌతికాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. చివరిసారి చూసేందుకు కాలనీలోని ప్రజలు తరలివచ్చారు. నివాళులర్పించిన వారిలో కరుణాకర్‌రెడ్డి, గోపెన్న, వాసుదేవర రెడ్డి, బాలయ్య, రాజనాల సుధాకర్, బాలుడు, చాంద్‌బాష, కో ఆప్షన్ సభ్యులు జాకీర్‌ఉసేన్, కృష్ణారెడ్డి, పెద్ద స్వామి తదితరులు ఉన్నారు.

నివాళి

కల్లూరు: గురుస్వామి బొమ్మన కృష్ణారెడ్డి(77) మృతదేహాన్ని నగర మేయర్ బీవై రామయ్య బుధవారం సందర్శించి నివాళులర్పించారు. కాగా బొమ్మన కృష్ణారెడ్డి దేవనగర్‌లోని సత్య నారాయణ స్వామి ఆలయంలో గత 30 ఏళ్లుగా శివ భక్తులకు మాలధారణ చేస్తూ, అలాగే దాతల సహాయంతో 25 ఏళ్లుగా శివ స్వాములకు అన్నదానం చేస్తూ వచ్చారు. కార్పొరేటర్ దండు లక్ష్మీకాంతరెడ్డి, సీఎంఓ కోఆర్డీనేటర్లు శ్రీకాంత్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

గడివేముల: మండల కేంద్రమైన గడివేములకు పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి గురవారం వస్తున్నట్లు ఎంపీడీఓ విజయసింహారెడ్డి బుధవారం తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో కొత్తగా మంజూరైన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన సచివాలయాల కన్వీనర్లు, వలంటీర్లు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలన్నారు.

నేడు కేంద్ర బృందం పర్యటన

కల్లూరు: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కేంద్ర బృంద సభ్యులు గురువారం మండలంలోని తడకనపల్లె, చిన్నటేకూరు గ్రామాల్లో పర్యటించనున్నట్లు ఎంపీడీఓ జీవీ రమణమూర్తి బుధవారం తెలిపారు. కేంద్ర బృందంలోని సభ్యులు తడకనపల్లె పశు వసతిగృహాన్ని, చిన్నటేకూరులో ఎస్‌డబ్ల్యూపీసీ పరిశీలిస్తారన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



ఏఐఎస్ఎఫ్ క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న కోడుమూరు సీఐ శ్రీధర్

కోడుమూరు: అఖిల భారత విద్యార్థి సమైఖ్య 2023 సంవత్సరానికి సంబంధించి క్యాలెండర్‌ను కోడుమూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ ఆవిష్కరించాడు. బుధవారం సర్కిల్ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయకారదర్శి రంగస్వామి అధ్యక్షతన పోస్టర్ విడుదల కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని భవిష్యత్ కాపాడుకోవాలని సూచించారు.ఆకర్షణలకు లోనై పెడదారి పట్టకూడదన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు సిద్ధు, ఉదయ్‌కుమార్, మహేష్, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

రసాయన శాస్త్రంపై అవగాహన

పాణ్యం: మండల పరిధిలోని శాంతిరాం ఫార్మ సీ కళాశాలలో రసాయన శాస్త్రంపై విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్‌డాక్టర్ జీకే నాయుడు మాట్లాడుతూ.. మెదడులోని సెరోటోనిక్ సంతోషాన్ని కలిగించే ఓ రసాయనమన్నారు. అత్యాధునికి వ్యాక్సిన్, మందుల తయారీలో రసాయశాస్త్రం ఎంతో ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదనసెట్టి, ఏఓ ఆశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోలుకోలేక మహిళ మృతి



మృతి చెందిన రాధారాణి

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామం వద్ద జాతీయ రహదారిపై ఈ నెల 2వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన రాధారాణి(55) కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి బుధవారం తెలిపారు. వివరాల మేరకు కల్లూరు మండలం బి. తాండ్రపాడు గ్రామానికి చెందిన రాధారాణి ఆళ్లగడ్డలో కుమార్తెను చూసేందుకు కుమారుడితో కలిసి బైక్‌పై వెళ్తుండగా తమ్మరాజుపల్లె వద్ద బీపీ డౌన్ కావడంతో కింద పడింది. ఘటనలో గాయపడిన ఆమెను చికిత్స నిమిత్తం శాంతిరాం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు చెప్పారు. మృతురాలికి భర్త గోపాల్‌శర్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

‘ఉపాధి’ని వ్యవసాయానికి అనుసంధానించాలి

- కేంద్ర బృందానికి విన్నవించిన ఎమ్మెల్యే కాటసాని
- మహిళల విజయ గాథలపై ప్రశంసల వెల్లువ



హాజరైన పొదుపు మహిళలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఓర్వకల్లు: జాతీయ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి కేంద్ర బృందానికి విన్నవించారు. జాతీయ ఉపాధి హామీ పథకం అమలుతీరు, పథకం ద్వారా లబ్ధిపొందిన ప్రజల అభిప్రాయాలను అధ్యయనం చేసేందుకు బుధవారం స్థానిక పొదుపు భవనంలో పొదుపు మహిళలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ.. ఉపాధి పథకం పేదలకు జీవనోపాధిగా మారిందన్నారు. పథకం ద్వారా ఎంతో మంది లబ్ధిపొందారని, వారి జీవనంలో ఎన్నో మార్పులు తీసుకొచ్చాయన్నారు. ఈ పథకాన్ని రైతులకు అనుసంధానం చేసి,మరింత విస్తృత పరచాల్సిన ఆవశ్యకత ఉందని అభిప్రాయపడ్డారు. ఐదు ఎకరాలులోపు ఉన్న ప్రతి సన్న, చిన్నకారు రైతుల పొలాలను ఉపాధి పథకంతో అభివృద్ధి చేయడం వల్ల కూలీల ఖర్చులు తగ్గడమేగాక, వారిని కూడా ప్రోత్సహించినట్లు అవుతుందని పేర్కొన్నారు. ఇక్కడి పొదుపు మహిళలు సాధించిన ఆర్థిక విజయాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. అనంతరం పొదుపు సంఘాల పనితీరు, సాధించిన అద్భుత విజయాలను విన్న కేంద్ర బృందం సభ్యులు ప్రశంసలు కురిపించారు. పొదుపు సంఘాల ద్వారా మహిళలు తాము ఆర్థికంగా ఎదగడమేగాక, ఇతరుల అభివృద్ధికి దోహదపడడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. అనంతరం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌ను సందర్శించారు. అక్కడ నాడు–నేడు పథకం కింద ఉపాధి నిధులతో చేపట్టిన పనులను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యులు అమర్‌జిత్ సిన్హా, ప్రొఫెసర్ అశోక్ పంకజ్, సోనాల్డ్ దేశాయ్, ప్రవీణ్ మెహతా, ప్రొఫెసర్ జ్యోతిస్ పాలన్, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటసుబ్బయ్య, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, ఎంపీడీఓ శివనాగప్రసాద్, తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కొత్త పింఛన్ల పంపిణీ

సి.బెళగల్: మండలానికి ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన పింఛన్లను గురువారం పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ రాముడు బుధవారం తెలిపారు. మండల వ్యాప్తంగా 6,960 పింఛన్లు ఉండగా, వీటికి అదనంగా కొత్తగా 276 పింఛన్లు మంజూరయ్యాయన్నారు. కొత్త పింఛన్లను ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ చేతుల మీదుగా లబ్ధిదారులుగా పంపిణీ చేస్తామని, కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో గురువారం కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ దస్తగిరి బుధవారం తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరవుతారన్నారు. కావున మండలంలోని అధికారులు, పింఛన్‌దారులు పాల్గొనాలన్నారు. మండలంలో మొత్తం 215 కొత్త పింఛన్లు మంజూరైనట్లు ఆయన తెలిపారు.

6న అయ్యప్పస్వామి చండీయాగం



చండీయాగం పోస్టరును విడుదల చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కోడుమూరు: కోడుమూరు పట్టణంలో రూ.9 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న శ్రీ మణికంఠ శ్రీ ధర్మ శాస్త్ర అయ్యప్పస్వామి ఆలయంలో ఈ నెల 6వ తేదీన చండీ మహారుద్ర, చండీయాగం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు నలుబోలు భాస్కర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో చండీయాగం సంబంధించిన పోస్టర్‌ను ఆలయ కమిటీ సభ్యులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శుక్రవారం ఉదయం ఆరు గంటల నుంచి చండీ మహారుద్ర, చండీ మహాయాగ పూజలు ప్రారంభమవుతాయి, అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఆర్యవైశ్య సంఘం మహిళా కమిటీ సభ్యులతో శ్రీ లలితాపారాయణం, విష్ణుపారాయణం కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. చండీయాగంలో 150 మంది జంటలు పాల్గొంటారని కమిటీ సభ్యులు తెలియజేశారు. ఆలయ నిర్మాణానికి భక్తులు విరాళాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చిట్టిబాబు, గంగాధర్, జీతూరి రవి, కాటేగారి రవి, కాటేగారి గోపి, కిరణ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ధర్మాన్ని పరిరక్షించాలి



మల్లాపురం దేవాలయంలో ధార్మిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

గూడూరు రూరల్: సమాజంలో వ్యక్తులందరిని కలిపేది ధర్మమేనని, దాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కర్నూలు లలితా పీఠం పీఠాధిపతి శ్రీ గురు మేడా సుబ్రహ్మణ్యం స్వామి పేర్కొన్నారు. మల్లాపురంలో బుధవారం తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి దేవాలయంలో ధార్మిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకు స్థానిక దేవాలయంలో ధార్మిక ప్రవచనాలు, భజన, కుంకుమార్చనలు, గోపూజ, సంకీర్తనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ప్రతి ఒక్కరూ ధర్మాన్ని పాటించాలని, అది మనల్ని కాపాడుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచు భాగ్యమ్మ, జిల్లా ధర్మ ప్రచార మండలి సభ్యులు సురేష్, సోమేశ్వరరెడ్డి, లక్ష్మికాంతరెడ్డి, మద్దిలేటిరెడ్డి, నడిపి రాముడు, ప్రసాద్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ తనిఖీ



గడివేముల విద్యుత్ సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ ఉమాపతి

గడివేముల: మండల కేంద్రమైన గడివేములోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఎస్ఈ ఉమాపతి బుధవారం రాత్రి అకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. గ్రామంలో 220 కేవీ సబ్‌స్టేషన్‌ను నిర్మిస్తే బాగుంటుందని నాయకులు, రైతులు ఎస్ఈ దృష్టికి తెచ్చారు. దీంతో లో ఓల్టేజీ సమస్య ఉన్న పాణ్యం, మిడుతూరు, వెలుగోడు, బండి ఆత్మకూరు మండలాలకు విద్యుత్ అందించే అవకాశం ఉంటుందన్నారు. ఈ విషయంపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఎస్ఈ రామకృష్ణ, ఏఈఈ రవికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



చనుగొండ్లలో బ్యాంకు సేవలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కోడుమూరు/గూడూరు రూరల్: బ్యాంకులు, ప్రభుత్వం మంజూరు చేస్తున్న వివిధ రకాల రుణాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ మల్లికార్జునసెట్టి తెలిపారు. బుధవారం చనుగొండ్ల గ్రామంలో ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. సామాజిక భద్రత పథకాలైన ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, ఆటల్ పెన్షన్ యోజన, సుకన్య సంవృద్ధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ డీఎస్ ఆర్‌జీ పార్థు, చాంద్‌బాషా, కళాబృంద సభ్యులు విజయ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

24045.33 ఎకరాల్లో రీసర్వే పూర్తి

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలంలోని గ్రామాల్లో బుధవారం నాటికి 24045.33 ఎకరాల భూముల రీ సర్వే పూర్తయిందని కర్నూలు రూరల్ తహసీల్దార్ డి వెంకటేష్ నాయక్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని 21 రెవెన్యూ గ్రామాల్లో భూముల రీ సర్వే శరవేగంగా కొనసాగుతోందన్నారు. గ్రామాల్లో చేపడుతున్న రీ సర్వేపై ఎప్పటికప్పుడు వీఆర్‌ఓలు, గ్రామ సర్వే సహాయకులతో సమీక్షిస్తున్నామన్నారు. రైతులకు రీ సర్వేపై ముందస్తుగా గ్రామాల్లో దండోరా వేయించి సమాచారం అందిస్తున్నామని తెలిపారు. రైతులు తమ పొలాల్లో వద్ద ఉండి వివరాలను సర్వే బృందాలకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- పెన్షన్లపై తప్పుడు ప్రచారాలు నమ్మొద్దు
- గత టీడీపీ ప్రభుత్వంలో ఏ ఒక్క హామీని అమలు చేయని బాబు
- 2019 ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెప్పారు
- ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్



కొత్త పెన్షన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

కోడుమూరు: ప్రతి పేదవాడు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. బుధవారం కోడుమూరు పట్టణంలోని స్నేహ వినాయక కల్యాణ మండపంలో పెన్షన్ల పంపిణీ వారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ..గత టీడీపీ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన ఎన్నికల హామీల్లో ఏ ఒక్కటీ కూడా పూర్తిగా నెరవేర్చలేదని విమర్శించారు. రైతుల రుణ మాఫీ, పొదుపు సంఘాల రుణాలు మాఫీ కాలేదని, అభివృద్ధిని పూర్తిగా విస్మరించడంతో ప్రజలు 2019లో తెలుగుదేశం పార్టీకి తగిన బుద్ధి చెప్పారని ఎమ్మెల్యే ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పదవి చేపట్టిన ఆరు నెలల్లోపే ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్ని అమలు చేశారన్నారు. ఎన్నికల హామీ మేరకు ప్రతి ఏటా పెన్షన్ పెంచుతున్నారని, ఇందులో భాగంగానే రూ.2500 పింఛన్‌ను రూ.2750కు పెంచారని గుర్తు చేశారు. కోడుమూరు మండంలో కొత్తగా 326 పెన్షన్లు మంజూరయ్యాయన్నారు. పేద ప్రజలకు అందుతున్న పెన్షన్లను తొలగిస్తున్నారని తెలుగుదేశం పార్టీ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాలు నమ్మవద్దని ప్రజలను కోరారు. ప్రతి ఆరు నెలలకోసారి పెన్షన్ల పంపిణీపై సోషల్ ఆడిట్ జరుగుతుందని, ఎవ్వరూ అర్హులో, ఎవ్వరూ అనర్హులో అనే విషయంపై నోటీసులు వచ్చిన వారు సరైన ధ్రువపత్రాలు ఇస్తే పెన్షన్‌ను పునరుద్ధరిస్తారని తెలియజేశారు.

శాశ్వత భూహక్కు పత్రాల పంపిణీ : జగనన్న శాశ్వత భూహక్కు– భూరక్ష పథకంలో భాగంగా రీ సర్వే పూర్తయిన అమడగుంట్ల గ్రామంలోని 692 మంది రైతులకు ఎమ్మెల్యే భూహక్కు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేషఫణి, ఎంపీడీవో చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ భీమేశ్వరరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు తిరుపతి, గోరంట్ల సర్పంచ్ బాలకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రతాప్‌రెడ్డి, మల్లేష్, ప్రభాకర్, విజయ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

- ‘గడప గడప’లో ఎమ్మెల్యే సుధాకర్



మునగాలలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

గూడూరు రూరల్: ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలతోనే పేద కుటుంబాల ఆర్థిక అభివృద్ధి సాధ్యపడుతుందని కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ పేర్కొన్నారు.మండల పరిధిలోని మునగాలలో బుధవారం రెండవ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేను వైస్ ఎంపీపీ సువార్తమ్మ, సర్పంచు గోపాల్ ఇతర నాయకులు గజమాలతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఎస్సీ, బీసీ కాలనీల్లోని ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల వివరాలను లబ్ధిదారులకు వివరించారు. కాలనీల్లో నెలకొన్న తాగునీరు, కుళాయిలు, డ్రైనేజీలు, రేషన్‌కార్డులు తదితర సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే.. అర్హతే ప్రమాణికంగా సీఎం జగన్ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. అర్హత ఉన్నా పథకాలు రాని వారు నిరాశ చెందాల్సిన అవసరం లేదని, ప్రతి ఆరు నెలలకు ఒక మారు ప్రభుత్వం ప్రజల వినతులు, ఫిర్యాదులను పరిశీలించి పథకాలు, నిధులను మంజూరు చేస్తుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి నెల వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే పింఛన్ సొమ్ము, రేషన్ సరుకులను అందిస్తున్నామన్నారు. ఇటీవలే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ నెల నుంచి ఏడాది పాటు రేషన్‌కార్డు దారులకు ఉచితంగా బియ్యాన్ని అందించే కార్యక్రమాన్ని చేపట్టాయన్నారు. కాగా ఎమ్మెలే గ్రామంలో కార్డుదారులకు ఉచిత బియ్యాన్ని అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మౌలాలి, గూడూరు నగరపంచాయతీ వైస్ చైర్మన్లు అస్లాం, లక్ష్మన్న, పట్టణ కన్వీనర్ అబేలు, స్థానిక నాయకులు రామాంజనేయులు, డీలర్ మద్దిలేటి, లక్ష్మన్న, చాకలి సుంకన్న, సలీంబాష, శ్రీనివాసులు, చిన్న రాముడు, వీరేష్‌ఆచారి, హనుమన్న, తిక్కయ్య, ప్రసాద్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



32వ వార్డులో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సుపరిపాలన అందిస్తున్నామని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం కల్లూరు అర్బన్ 32వ వార్డు 80, 81వ వార్డు సచివాలయాల పరిధిలోని గంగావతి నగర్, సంఘం, పోలీసు కాలనీల్లో స్థానిక కార్పొరేటర్ సాన శ్రీనివాసులు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కాలనీలో ఏవైనా సమస్యలు ఉంటే తనకు తెలియజేయాలన్నారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సకాలంలో అందిస్తున్నారా? లేదా? అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గతంలో ఇస్తున్న పెన్షన్‌కు అదనంగా రూ. 250 పెంచి మొత్తం రూ. 2750 అందిస్తుండటంతో అవ్వా, తాత, ఇతర పెన్షన్‌దారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. కాలనీల్లో నెలకొన్న రోడ్లు, కాలువలు ఇతర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి స్థానికులు తీసుకెళ్లగా వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, కార్పొరేటర్లు మిద్దె చిట్టెమ్మ, సంగాల సుదర్శన్‌రెడ్డి, కాశపోగు జయరాముడు, ఎరుకల వెంకటేశ్వర్లు, ఇప్పల నారాయణరెడ్డి, డీఎల్ కాంతరెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.హనుమంతురెడ్డి, నంద్యాల పార్లమెంట్ జిల్లా ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శి సందేపోగు శివ, ఎం.సుధాకర్‌రెడ్డి, గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

‘గోరుకల్లు’కు మంచి రోజులు

- జలాశయం నిర్వహణకు ప్రభుత్వం చర్యలు
- రూ.73 లక్షలు మంజూరు



లోతైన బీటలు వారిన కట్ట





జలాశయం కట్టపై పిచ్చి మొక్కలు పెరిగిన దృశ్యం, గోరుకల్లు జలాశయం

పాణ్యం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వల్ల గోరుకల్లు జలాశయంకు మంచి రోజులు వచ్చాయి. ప్రాజెక్ట్ నిర్వాహణ కోసం రూ.73 లక్షలు నిధులు మంజూరు చేసింది. గోరుకల్లు జలాశయంను 12.04 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించారు. ఈ ప్రాజెక్టు నుంచి ఎస్సార్బీసీ, గాలేరు ద్వారా వైఎస్సార్, చిత్తూరు, అనంతపురం, నెల్లూరు జిల్లాలకు సాగు నీరు అందుతుంది. ఎంతో ప్రాధాన్యత కలిగిన ఈ ప్రాజెక్టును గత ప్రభుత్వంలో అప్పటి సీఎం చంద్రబాబు రెండు సార్లు సందర్శించారు కాని పెండింగ్ పనులను పట్టించుకోలేదు. దీంతో అప్పటి నుంచి ప్రాజెక్ట్ పెండింగ్ పనులు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే ఉండటంతోపాటు నిర్వహణకు కూడా నోచుకోలేదు. ప్రాజెక్ట్‌కు దాదాపుగా ఒకటిన్నర కిలోమీటర్ దూరం ఉన్న మట్టి కట్ట పొడవు వెంట విపరీతంగా కంపచెట్లు పెరిగిపోయాయి. అంతేకాక బండ్(కట్ట)పై లోతైన నెర్రలిచ్చాయి. వీటితో పాటు గ్యాలరీలో నిత్యం నీటిని తొడిపోయాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే ఇటీవల ఇంజినీర్లతో సమావేశమైన ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డికి వారు సమస్యలను వివరించారు. దీంతో ఆయన ఆయా శాఖల దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో ప్రభుత్వం నుంచి నిర్వహణ కోసం నిధులు మంజూరయ్యాయి. పంపులు కూడా పాతవి కావడంతో వాటిని కూడా మార్చాలని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

కట్టపై కంప చెట్లు తొలగిస్తాం

గోరుకల్లు నిర్వహణ విషయమై సీఈ కబీర్‌బాషా దృష్టికి తీసుకెళ్లగా ప్రభుత్వానికి సమస్యలను తెలియజేశారు. దీంతో రూ.73 లక్షలు నిధులు మంజూరు అయ్యాయి. ఈ నిధులతో కట్ట(బండ్)పై కంపచెట్లను తొలగించి కట్టపై ఏర్పడిన నెర్రలను పూడ్చివేస్తాం. అలాగే గ్యాలరీలోకి వచ్చే నీటిని తోడేసేందుకు కొత్త పంపులను ఏర్పాటు చేస్తాం. పెండింగ్ పనులపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నాం.

–శుభకుమార్, ఈఈ, గోరుకల్లు జలాశయం

ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి

గడివేముల: మండల కేంద్రమైన గడివేములలోని భవిత కేంద్రంలో బుధవారం లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ స్కూల్ హెచ్ఎం శేషయ్య మాట్లాడుతూ.. అంధుల కోసం బ్రెయిలీ లిపి కనుకొన్న లూయిస్ బ్రెయిలీ గొప్పదనాన్ని వివరించారు. అనంతరం విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. దివ్యాంగులకు వీల్‌చైర్లు, చెవిటి మిషన్లు అందజేశారు.

సచివాలయ సమీక్షపై అధికారుల నిర్లక్ష్యం



పోలకల్ సచివాలయంలో మండల అధికారులు రాక కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగులు

సి.బెళగల్: ప్రతి నెల మొదటి బుధవారం మండల స్థాయి అధికారులు గ్రామ సచివాలయాలను సందర్శించి ఉద్యోగులు, వలంటీర్ల సమస్యలను, సచివాలయ నిర్వహణ, సంక్షేమ పథకాల అమలు తీరుపై సమీక్షించాల్సి ఉంది. ఇందుకోసం మండల పరిధిలోని 16 గ్రామ సచివాలయాలకు నోడల్ అధికారులను నియమించారు. అయితే వారు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మండలంలో సచివాలయాల్లో ఏ ఒక్క నోడల్ అధికారి కూడా బుధవారం సమీక్ష నిర్వహించలేదు. దీంతో సచివాలయాల ఉద్యోగులు మధ్యాహ్నం వరకు వారి రాక కోసం ఎదురుచూశారు. సచివాలయ సేవల నిర్వహణ పై మండల అధికారులు నిర్లక్ష్యంగా ఉండటంపై పలువురు అసహనం వ్యక్తం చేశారు. దీనిపై ఎంపీడీఓ రాముడును వివరణ కోరగా...తాను జిల్లా కేంద్రంలో జరిగిన సమీక్షా సమావేశానికి వెళ్లినట్లు తెలిపారు. సచివాలయాల సమీక్షకు నోడల్ అధికారులు వెళ్లాలని ఆదేశించామని, వెళ్లనివారిపై ఉన్నతాధికారుకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.